

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజాశక్తి - కడప : జమ్మలమడుగు సబ్ డివిజన్ కార్యాలయంలో రూ. 16.20 లక్షల సంస్థ సొమ్ము కాజేసిన ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్ అయ్యారు. జమ్మలమడుగు సబ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎం.సుజిత్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సి.హెచ్ విజయ బాబును సస్పెండ్ చేశామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ డ్యూటీ బిల్లుల ద్వారా 2024 డిసెంబర్ 20న వచ్చిన మొత్తం రూ. 8,93,694 , 2025 జనవరి 23న వచ్చిన రూ. 7,66,250 మొత్తం కలిపి రూ. 16,59,944 ను 2024 అక్టోబర్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 10 వరకు బ్యాంకులో సంస్థ అకౌంట్‌కు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినందుకు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సి. హెచ్. విజయ బాబు నాలుగు నెలల నుంచి అవినీతిని పర్యవేక్షణ చేయనందుకు సస్పెండ్ చేశామని తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే పనులకు పాల్పడితే ఎంతటి వారైనా శాఖా పరమైన చర్యలు తప్పవని ఆయన ఉద్యోగులను హెచ్చరించారు.

ప్రేమికుల రోజే దారుణం

యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి

- తీవ్రంగా గాయపడిన బాధితురాలు
- ఆసుపత్రిలో చేర్పించిన బంధువులు
- పరామర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు
- మెరుగైన వైద్యం అందిస్తాం : మంత్రి
- నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం :ఎస్‌పి
- సంఘటనపై ఫోన్లో ఆరా తీసిన మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత
- యువతి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన మేజిస్ట్రేట్



మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇస్తున్న యువతి, మీడియాతో మాట్లాడుతున్న మంత్రి

ప్రేమికుల దినోత్సవం రోజునే దారుణం చోటు చేసుకుంది. సైకోలా మారిన యువకుడు తాను ప్రేమించిన యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తాను ప్రేమించిన అమ్మాయి మరెవ్వరికీ దక్కకూడదని కర్కశత్వానికి పాల్పడ్డాడు. తనను కాదని తల్లిదండ్రులు చూసిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడిందని అంతమొందించేందుకు వెనుకాడలేదు. పథకం ప్రకారం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. కత్తితో దాడి చేసి, ఆపై యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడి పరారయ్యాడు. గమనించిన బంధువులు యువతిని హుటాహుటినా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మదనపల్లి డిఎస్‌పి, సిఐలను అప్రమత్తం చేసి ఆసుపత్రికి పంపడంతో వారు సకాలంలో ఆస్పత్రికి చేరుకుని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎస్‌పి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువతి పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. వివరాలు..

ప్రజాశక్తి -మదనపల్లి అర్బన్ / గుర్రంకొండ

గుర్రంకొండ మండలం, నడిం కండ్రిక పంచాయతీ, ప్యారంపల్లెకు చెందిన జనార్ధన్, రెడ్డమ్మ దంపతులకు కుమార్తె గౌతమి, కుమారుడు రాజేష్ ఉన్నారు. గౌతమి డిగ్రీ వరకు చదువుకొని మదనపల్లె కదిరి రోడ్డులోని సంఘం ఫంక్షన్ హాల్ వద్ద ఓ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో మదనపల్లె అమ్మ చెరువు మిట్టకు చెందిన చేనేత కార్మికుడు మురళి కుమారుడు గణేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో ఆమె వెంట వేధించేవాడు. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు కుమార్తెను పనులు మాన్పించి ఇంటికే పరిమితం చేశారు. బంధువుల పిల్లవాడికి ఇచ్చి వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ నేపథ్యంలో ఈనెల 7న గౌతమికి నిశ్చితార్థం అయింది. ఏప్రిల్ 29న వివాహనం కానుంది. భరించలేని ప్రేమోన్మాది సైకోలా మారిపోయాడు. తాను ప్రేమించిన అమ్మాయి తనను కాదని మరో వ్యక్తిని వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. స్నేహితునితో కలిసి శుక్రవారం తెల్లవారుజాము చీకట్లోనే యువతి స్వగ్రామం ప్యారంపల్లికి వెళ్లాడు. ఉదయం 6 గంటలకే తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగానే గౌతమి ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి చొరబడ్డాడు. ఈ సమయంలో తననే పెళ్లి చేసుకోవాలని యువతితో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. పథకం ప్రకారమే వెంట తెచ్చుకున్న కత్తితో యువతిపై దాడి చేయడంతో మెడ, గొంతు, చేతులపై రక్త గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న యాసిడ్ ను బలవంతంగా తాపబోయాడు. ఆమె నిరాకరించడంతో ముఖం మీద పోశాడు. దీంతో ఆమె కుప్పకూలి కింద పడింది. ఇంటి వాకిలి దగ్గరికి వేసుకొని పరారయ్యాడు. స్థానికంగా ఉన్న దేవాలయంలో భక్తి పాటలు పెట్టడంతో ఈ ఇంట్లో ఏమి జరుగుతుందో స్థానికులకు తెలియలేదు. ఇదిలా ఉండగా గౌతమి బంధువైన జయమ్మ పాలకోసం గౌతమి ఇంటికి వెళ్లగా బాధితురాలి కుప్పకూలి పడి ఉండటాన్ని చూసి కేకలు వేసింది. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఏకమై బాధితురాలిని 108లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అక్కడికి డిఎస్‌పి కొండయ్యనాయుడు, సిఐలు సత్యనారాయణ, ఎరిషావల్లి, రామచంద్ర వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నం చేశారు. అనంతరం మేజిస్ట్రేట్ వచ్చి యువతి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఇదే సమయంలో మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్



యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమి, నిందితుడు గణేష్ (ఫైల్‌ఫొటో)

ద్వారా జరిగిన సంఘటన వివరాలను బాధితురాలి తండ్రితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. విషయం పట్టణంలో దావణంలా వ్యాపించడంతో యువతిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆస్పత్రి ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంకొండ పోలీసులు తెలిపారు.

బాధితురాలిని పరామర్శించిన మంత్రి, ఎస్‌పి, ఎమ్మెల్యే

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన యువతిని పరామర్శించేందుకు మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి వెంకటాద్రి, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి ఆసుపత్రికి చేరుకొని యువతిని పరామర్శించారు. ఆమె తల్లిదండ్రులను దాడిపై ఆరా తీశారు. వైద్యులతో భేటీ అయి యువతి ఆరోగ్య పరిస్థితిని కనుక్కున్నారు. అనంతరం నారా లోకేష్‌కు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. అనంతరం తీవ్రంగా గాయపడిన గౌతమిని బెంగుళూరుకు తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుంది : మంత్రి

యువతిపై యాసిడ్ దాడి చాలా బాధాకారమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యానించారు. యువతి పూర్తిగా కోలుకునేవరకు వైద్య ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యువతులు ఇలాంటి థ్రెట్ ఉన్నట్లు ముందే పసిగడితే పోలీసులను ఆశ్రయిస్తే ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలింపు : ఎస్‌పి

ఈ దుశ్చర్యకు పాల్పడింది మదనపల్లె ప్రాంతానికి చెందిన గణేష్‌గా గుర్తించామని, నిందితున్ని పట్టుకోవడం కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. త్వరలోనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు. నిందితుడి ఆచూకి తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అరెస్టు చేసిన తరువాత తామే మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు.



యువతిపై యాసిడ్ దాడిని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రేమ పేరుతో దాడులు ఆటవిక చర్య : సిపిఎం

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని నిరసన

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ప్రేమ పేరుతో దాడులు చేయడం ఆటవికమని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. యువతిపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన నిర్వహించారు. మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ గుర్రంకొండ మండలం, ప్యారంపల్లికి చెందిన యువతిపై ప్రేమోన్మాది దాడిని ఖండిస్తూ, సైకో గణేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిగ్రీ చదువుకుని స్వయం ఉపాధి పొందుతున్న యువతి ప్రేమించలేదనే ఉన్మాదంతో కత్తితో పొడిచి, యాసిడ్ పోసి దాడి చేయడ్నా ప్రతి ఒక్కరూ తలదించుకునే దుర్ఘటన అన్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు. బాధిత యువతి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని, ఆమెకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిందితుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్త, పార్టీ సానుభూతి పరుడిగా తెలుస్తోందని, ఆ కోణంలో నిందితున్ని రక్షించే ప్రయత్నం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, సిఐటియు నాయకులు రెడ్డిప్రసాద్, వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు శివప్రసాద్, వెంకటశివ, మహిళా సంఘం నాయకురాలు రెడ్డిప్రసన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాంబశివ నాయక్, యువజన నాయకులు పవన్ పాల్గొన్నారు.

ఆదర్శ నేత దామోదరం సంజీవయ్య : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

దళిత కుటుంబంలో జన్మించి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన దామోదరం సంజీవయ్య యావత్ భారత దేశానికే ఆదర్శమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో గత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104 జయంతి వేడుకలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కలెక్టర్‌తోపాటు జెసి అదితి సింగ్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేశ్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ అనిత, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన నిష్కళంక, నిస్వార్థ, నిరడంబరా నేత దామోదరం సంజీవయ్య అని ప్రశంశించారు. దళిత కుటుంబంలో జన్మించి అత్యున్నత పదవులను అధిరోహించడం భారత దేశం మొత్తం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో ముందుగా ప్రముఖులు, ప్రత్యేక అతిధులు దామోదరం సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగులు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది, దళిత నాయకులు, పలువురు విద్యార్థులు హాజరైయ్యారు.

ప్రజాశక్తి- కడప అర్బన్ : నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన మహనీయుడు దామోదరం సంజీవయ్య అని ఎస్‌పి ఐ.జి. అశోక్ కుమార్ కొనియాడారు. పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సంజీవయ్య చిత్రపటానికి ఎస్.పి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్పూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు.

కడపలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవి అన్నారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయిందని, అప్పటినుంచి తాగునీటి సమస్య పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, నీటిపారుదల అధికారులతో సమీక్షించానన్నారు. పెన్నా నదులు నీరు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. రోజూ నీళ్లు వదిలేలా ప్రస్తుతం 13 డివిజన్‌లో ప్రయోగాత్మకంగా శనివారం ప్రారంభిస్తున్నామని తెలిపారు. సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, మైనార్టీ నగర అధ్యక్షులు ఖాజాపీర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన

ప్రతినెల మూడో శనివారం ప్రతి గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఇఒపిఆర్‌డి ముజఫర్ రహీం పేర్కొన్నారు శుక్రవారం స్థానిక ఎంపిడిఓ సభా భవనంలో ఎంపిడిఒ మైథిలీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, ఎంపిటిసిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి కూడా ప్రతి నెల మూడో శనివారం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు గ్రామాల్లో ఎక్కడ కూడా అపరిశుభ్రంగా ఉండకుండా అన్ని వీధులు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, కమిషనర్ మనోజ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం మొదటి, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి మార్చి 1 నుంచి 20 వరకు ఆయా తేదీల్లో ఉదయం 9 నుండి 12 వరకు పరీక్షలుంటాయన్నారు. జిల్లాలో మొత్తం 64 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. అన్ని ప్రయివేటు కళాశాలలను సెన్సిటీవ్ కేంద్రాలుగా గుర్తించి ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలను అమర్చుతాయని చెప్పారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. పరీక్ష ప్రారంభానికి అర గంట ముందు నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులకు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండేలా ఉదయం 6 నుండి 8 గంటల మధ్యలో బస్సులను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక కూడా బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్‌టిసి ధికారులను ఆదేశించారు. మాస్ కాపీయింగ్ కు పాల్పడే అవకాశాలు ఎక్కడా లేకుండా జాగ్రత్త వహించాలని, ఈ విషయంలో కళాశాలల యాజమాన్యం, సిబ్బంది అత్యంత జాగ్రత్త వహించాలని చెప్పారు. ఏ చిన్నపాటి పొరపాట్లు జరిగినా సంబంధిత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు, అత్యవసర మందులతో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకుని ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆర్‌ఐఒ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పరీక్షల కోసం 3 ఫ్లైయింగ్, 5 పెయిర్ల సిట్టింగ్ స్క్వాడ్లను, 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్టుమెంటల్ అధికారులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను పూర్తిగా మూసి వేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారం ఎంతైనా అవసరం అని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



ఇంటర్ పరీక్షలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

20 మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

ప్రజాశక్తి - కడప : జిల్లాలో నాలుగు డివిజన్ల పరిధిలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యల తీసుకుంటామని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. రెవెన్యూ సంబంధిత విషయాలు, మ్యుటేషన్, తదితర సమస్యలు పరిష్కరించడంలో ఆర్‌ఐలు, విఆర్‌ఒలు, సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు 20 మంది సచివాలయ రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అనంతరం వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటువంటి జాబితాలో బద్వేల్ మండలం, తిప్పనపల్లి సెక్రటేరియట్, విఆర్‌ఒ సాలమ్మ చక్రాయపేట మండలం, సురభి సెక్రటేరియట్, సర్వేయర్ విజయ్ కుమార్, దువ్వూరు మండలం, దువ్వూరు, విఆర్‌ఒ కె. మునిస్వామి, దువ్వూరు మండలం, ఇడమదాక, విఆర్‌ఒ టి. హరి యాదవ్, జమ్మలమడుగు మండలం బి బొమ్మపల్లి విఆర్‌ఒ ఎ. భీమన్న, కడప మండలం మామిళ్ళపల్లి విఆర్‌ఒ ఎస్. జహీర్ అబ్బాస్ కడప మండలం ఉక్కాయిపల్లి, విఆర్‌ఒ శ్రీనివాసులు, కలసపాడు మండలం, ఇ.రామాపురం విఆర్‌ఒ ఎ కొండయ్య, కలసపాడు మండలం పిడుగుపల్లి, విఆర్‌ఒ ఆనందరావు, కలసపాడు మండలం పిడు గుపల్లి ఆర్‌ఐ కె. చంద్రశేఖరరావు, కమలాపురం మండలం కోగటం ఆర్‌ఐ అర్జున్, కమలాపురం మండలం లేతపల్లి, విఆర్‌ఒ బి. చిన్న వెంకటరామన్న, మైదుకూరు మండలం ఆది రెడ్డిపల్లి విఆర్‌ఒ బి.మధు డేవిడ్, మైలవరం మం డలం తలమంచి పట్నం విఆర్‌ఒ టి ఓబులేసు, రాజుపాలెం మండలం టంగు టూరు విఆర్‌ఒ సరళ, వల్లూరు, వీఆర్‌ఒ ఖాజా మొహిద్దీన్, వేంపల్లి మండ లం రామిరెడ్డిపల్లి విఆర్‌ఒ ఓబయ్య, ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి విఆర్‌ఒ వై.శ్రీనివాసులు, వేంపల్లి మండలం కథలూరు సర్వేయర్ కె. బ్రహ్మయ్య, వేంపల్లి సర్వేయర్ పి బ్రహ్మకుమారెడ్డి ఉన్నారని తెలిపారు.

విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కడప అర్బన్ : పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డిజిపి ఆదేశాలు క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్షించాలని, త్వరిత గతిన పరిష్కరించాలని చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. 'పల్లె నిద్ర' కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లాలోని డిఎస్‌పిలు, సి.ఐలు పాల్గొన్నారు.

నిధులు తేవడంలో ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : ఢిల్లీలో బిజెపి కార్యాలయ నిర్మాణానికి రూ. 700 కోట్లు ఎక్కడి నుండి వచ్చాయో మోడీ సమాధానం చెప్పాలని, కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడంలో ఎపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎటువంటి కృషి చేయడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన విదేశీ ప్రయాణాల ఖర్చు ఎవరు భరిస్తున్నారు అనేది దేశ ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాల ప్రజల హక్కులను పరిరక్షించి, దేశాభివృద్ధికి పట్టం కడుతుందన్నారు ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి, బిజెపి కుటిల రాజకీయం నుంచి దేశాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

కన్నుల పండువగా శ్రీ విజయదుర్గా మల్లికార్జునుల కల్యాణోత్సవం

ప్రజాశక్తి- కడప అర్బన్ : జగన్మాత శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ బహుళ విదియ శ్రీ విజయ దుర్గాదేవి కడపలో కొలువు తీరిన పర్వదిన సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జామున 25 కలశాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో గణపతి, నవగ్రహ, చండీహోమం చేశారు. ఆలయ మండపంలో నవా వరణ శ్రీచక్రార్చనలు వైభవంగా నిర్వహించారు. 10.30 నిమిషాలకు అమ్మవారికి సుమంగళి పూజ చేశారు. ముత్యాల తలంబ్రాలు, పండితుల మనోహర వ్యాఖ్యానాలు, వేద మంత్రాల నడుమ ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ దంపతులు, కుటుంబ సభ్యులు కృతువును నిర్వహించగా, ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాత్రి 8 గంటలకు శ్రీ విజయదుర్గా దేవి సింహ వాహనంపై కొలువుదీరి కడప పురవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరింది.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - గోపవరం

ఎస్‌పి జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి పలు ప్రధాన రహదారులలో బైకుల మీద తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు, అనంతరం అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని చెప్పారు. ఈ విచార ఘటనల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవాలని తెలియజేశారు.



నూతన వధూవరులతో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి

వివాహ వేడుకల్లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-కడప అర్బన్

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి కుమారుడు ఎం.వి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి, లక్ష్మీ మౌనిక రెడ్డి వివాహం ఘరంగా నిర్వహించారు. శుక్రవారం రామాంజనేయపురంలోని మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ సెంటర్లో వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైసిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఎం.వి.శ్రీదేవి జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. జగన్‌తో సెల్ఫీ తీసుకునేందుకు చాలామంది పోటీపడ్డారు. వివాహ మహోత్సవానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, వివిధ కళాశాల యాజమాన్యాలు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

వైఎస్ఆర్ జిల్లాకు అత్యుత్తమ పురస్కారం

ప్రజాశక్తి - కడప : ఆకాంక్షిత జిల్లాలలో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 'నీతీ ఆయోగ్' ద్వారా అత్యుత్తమ పురస్కారంతో రూ. 3 కోట్లను కేటాయించిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో ఫిబ్రవరి 2024 వరకు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను శుక్రవారం జిల్లాకు రూ. 3 కోట్ల నగదు పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించగా అందులో వైఎస్ఆర్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించదగ్గ విషయం. జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ఈ పురస్కారం జిల్లాను వరించింది.

కొత్త వక్ఫ్ చట్టాన్ని ప్రతిఘటిస్తాం

ప్రజాశక్తి - కడప : మతరక్కసి బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని ప్రతిఘటిస్తామని, మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మైనార్టీలకు తీవ్ర ద్రోహం చేశారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త చట్టం అమలును ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ విరుద్ధమైన కొత్త వక్ఫ్ చట్టం అమలును ఎన్‌డిఒ ప్రభుత్వం ఎక్కడా అమలు చేయలేదని సవాల్ చేశారు. కేవలం ముస్లిం మైనార్టీలు, వారికి సంబంధించిన ఉనికిని, మనుగడను దెబ్బతీసే విధంగా దుష్ట పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అజెండాను మాత్రమే అమలు చేస్తూ రాజ్యాంగ విరుద్ధమైన పరిపాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లు హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు శ్యామలమ్మ, సంజయ కాంత, రఫీ ఖాన్ పాల్గొన్నారు.

వనరుల కోసం వినతి

ప్రజాశక్తి - కడప : కడప జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జి ప్లస్ ఫైవ్ బిల్డింగ్ నిర్మాణం కోసం వనరులు సమకూర్చాలని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవిని, ఫైనాన్స్ సెక్రటరీ ని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నంద్యాల చిన్నయ్య, గ్రంథాలయ కార్యదర్శి నాగభూషణం కలిసి వినతి పత్రం అందజేశారు. భవన భవన నిర్మాణానికి నిధులు అనుమతులు మంజూరు చేయాలని కోరారు


సంక్షేమ పథకాలు దళితులకు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం చేస్తున్న సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాల్లోని దళితులకు అందేలా చూడాలని ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి దుద్యాల కోరారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మిని అనిత దీప్తి దుద్యాల మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గన్నేపాటి మల్లేష్, ఎస్‌సి కార్పొరేషన్ సిబ్బంది, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బందితో పాటు మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, శశివర్ధన్, అన్నమయ్య జిల్లా ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ టిడిపి తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి జవాబుదారీగా పనిచేయాలి

ప్రజాశక్తి - కడప : రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి జవాబుదారితనంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో బద్వేల్, కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు వివిధ చట్టాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారిక వేదికలో 80 శాతం పైగా రెవెన్యూ సమస్యల పైనే వస్తున్నాయని అన్నారు. ఇందుకు సంబంధించి కడప బద్వేలు ఆర్‌డిఒ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్వేయర్లు, విఆర్‌ఒలు డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లకు రెవెన్యూ అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించామన్నారు.

రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభం



ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని పులివెందుల-కడప ప్రధాన రహదారి పక్కన జగనన్న కాలనీలోని రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభం ఉండడమేకాక.. అదే స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నడిరోడ్డులో ఈ విద్యుత్ స్తంభం ఉండడంతో వాహనదారులు పక్కదారిని చూసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏదైనా కాలనీలోకి ఇంటి నిర్మాణానికి అవసరమైన సంబంధిత మెటీరియల్స్ తీసుకుని వెళ్లాలంటే ఈ నడిరోడ్డులో ఉన్న స్తంభం అడ్డు వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అక్కడి నుంచి తొలగించి క్రమబద్ధీకరణగా నిలుపుదల చేయాలని సంబంధిత విద్యుత్ అధికారులకు విన్నవించామని, స్పందన లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కాలనీకి అధికారులు వచ్చి వెళుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ శాఖాధికారులు భారీ మూల్యం చెల్లించక తప్పకదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంఆర్ఐ పాత పద్ధతిలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వాసుపత్రుల్లో ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ పాత పద్ధతుల్లో కొనసాగించాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం హాస్పిటల్ ఎదురుగా ధర్నా చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో 350 పడకలుగా ఏర్పాటు చేసి ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా జాయింట్ కమిషనర్‌కు పేదల బాధలు అర్థం కావడం లేదన్నారు. ఆయన రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ, ఎసి రూముల్లో నిద్రపోతూ పేదల ఆరోగ్యాలను ఏ విధంగా చూస్తున్నారో ఒకసారిపై అధికారులు ఆలోచించాలన్నారు. వెంటనే ఎంఆర్ఐ, స్కానింగ్‌ను పాత పద్ధతిలో కొనసాగించుకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. ధర్నాకు మద్దతుగా సిఐటియు కార్యదర్శి బి.విజయకుమార్, ప్రభుత్వాసుపత్రి వర్కర్స్ గౌరవాధ్యక్షులు రాఘవ, రవి, బాలసుబ్బయ్య, ఓబులేష్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షుడు మేరీ బాబు, చెంద్రాయుడు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, మహిళా సంఘం కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

వీర జవాన్లకు ఘన నివాళులు



రక్త దానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో పుల్వామా వీర సైనికుల శౌర్యానికి, త్యాగానికి గుర్తుగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం పుల్వామా చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా రక్తదాత ఆరోగ్యంతోపాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదాత అయ్యే పుణ్య కార్యక్రమానికి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్, ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ లోకేష్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో ఆర్కేవ్యాలీ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన 105 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రాం అధికారులు అపర్ణ, అనిల్ కుమార్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి, వాహన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో బ్లాక్ డే సందర్భంగా శుక్రవారం ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. 2019లో జరిగిన పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లను స్మరించుకుంటూ విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కో-ఆర్డినేటర్ పి.గౌరీశంకర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన జవాన్లందరినీ గుర్తు చేసుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపల్ శారద భవాని, ఎన్‌సిసి ఇన్‌స్పెక్టర్ దావీద్, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ఈనెల 14న బ్లాక్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రమణప్ప సత్రం దగ్గర నుంచి పూలంగళ్ల సర్కిల్ వరకు ఎక్స్ ఆర్మీ ఆధ్వర్యంలో మాజీ జవాన్లు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పుల్వామా దాడిలో మరణించిన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఎక్స్ ఆర్మీ అధికారులు, విద్యార్థులు చిత్రపటాలకు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తామని రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డు రమణ మహర్షి పాఠశాల పక్కన ఎస్ఎస్ కాంప్లెక్స్ 16వ రూంలో శుక్రవారం రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక వినోద్‌కుమార్ మాట్లాడుతూ దళిత బడుగు బలహీన వర్గాల కోసమే తాము ఈ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. దళిత బడుగు బలహీన వర్గాలకు సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు ఆకుమల్ల ప్రణయ్‌కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సుద్ధపల్లి మురళి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఉల్లి కిరణ్‌కుమార్, రాయలసీమ అధ్యక్షులు చంద్రశేఖర్, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షులు సికె కుమార్, రాయలసీమ కార్యదర్శి అరుణ్‌కుమార్, కడప జిల్లా ఉపాధ్యక్షులు సంగటి పుల్లయ్య, నంద్యాల జిల్లా సెక్రెటరీ లక్ష్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామోజీ ఇమ్మానుయేల్

ఎద్దుల కొండ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం ఎద్దుల కొండపైకి తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఇందుకుగానూ ఇఎపి గ్రాంట్ కింద రూ.1.19 కోట్లు మంజూరైంది. పనులను టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ నిధులు మంజూరైన గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో రోడ్డు పనులు ఆగిపోయాయని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిలిచిపోయిన పనులు చేసేందుకు బిటెక్ రవి ఎంతో శ్రద్ధతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్ డిఇ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బిజెపి నేత సుష్మా, రజనీకాంత్‌రెడ్డి, డాక్టర్ కరీముల్లా, మాజీ ఎంపిటిసి రఘునాథ్‌రెడ్డి, ఆలయ ఇఒ విశ్వనాథ్‌రెడ్డి, పిఆర్ ఎఇ శ్రీనువాసులు, ఆలయ సిబ్బంది, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నిరాడంబరుడు, నిజాయితీ పరుడు, అందరికీ ఆదర్శనీయుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో దామోదరం సంజీవయ్య 104వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ దళిత పక్షపాతి అని చెప్పేందుకు సంజీవయ్య ఉదంతమే చక్కటి నిదర్శనమని తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమా రాజా, వేమయ్య, వెంకటేష్, మహబూబ్ బాషా, రవి, రమణ, నాగరాజు, మదార్, వినయ్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇంటి పరిసరాలను నీరు నిలవకుండా శుభ్రంగా ఉంచుకోవాలని జోనల్ మలేరియా అధికారి లక్ష్మీ నాయక్ స్థానికులకు సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి ప్రజలు మలేరియా బారిన పడతారని, జాగ్రత్త వహించాలని వివరించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. శ్రీరాములపేట సచివాలయ పరిధిలో ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా వచ్చే ప్రమాదముందన్నారు. కౌన్సిలర్ ఎరికల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి వెళితే అక్కడ పట్టించుకోవడంలేదని ఆయన దృష్టికి తెచ్చారు. డాక్టర్లు జ్యోత్స్న శ్రీనాథ్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, ఎంపిహెచ్ఒ రవి శంకర్ రాజు, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు, స్థానిక ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

దుమ్ము, ధూళి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దుమ్ము, ధూళితో క్షయ వ్యాధి వస్తుందని, సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి జ్యోత్స్న సూచించారు. జువారి సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమల్లో సహజంగా దుమ్ము,ధూళిలోనే కార్మికులు పనిచేస్తుంటారని అన్నారు. దగ్గు, ఆయాసం ఉంటే వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మాస్కు, సేఫ్టీ వస్తువులు తప్పకుండా ధరించాలని సూచించారు. డాక్టర్లు నరసింహారెడ్డి, శ్రీలత, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాను పాలకులే అరికట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అక్రమ బియ్యం రవాణాను అరికట్టాలంటే పాలకుల చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నజీర్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో అక్రమ బియ్యం దందా అధికంగా ఉంద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం పక్కదారి పట్టడం బాధాకరమన్నారు. అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అరికట్టడం సాధ్యం కావడం లేదన్నారు. కేంద్రం సరఫరా చేస్తున్న బియ్యం 60శాతం పక్కదారి పడుతోందన్నారు. స్థానికంగా రైస్‌మిల్లుకు చేర్పించి సైక్లింగ్ చేయించి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అమ్ము తున్నారని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు చొరవతీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ పథకంలో మార్పు చేయాలన్నారు. సన్నబియ్యం ప్రతి మనిషికి 5కిలోలు సరఫరా చేయాలన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సన్నబియ్యం పేదలకు అందేలా యత్నించాలని నజీర్ సలహా ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు అలీ, ఖాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నజీర్

మహాశివరాత్రి కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన ఆవరణలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఇఒ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ యాదవ్, అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఈనెల 26,27న ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేపడతామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నూతన ఇఒగా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసులును ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరారెడ్డి, అర్చకులు చిన్నాస్వామి, గోవిందస్వామి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇఒ, కమిటీ సభ్యులు



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

పశువైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పశువైద్య విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి సమ్మెను విరమింపజేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు పశు వైద్య కాలేజీలో విద్యార్థులు చేస్తున్న సమ్మెకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్, పట్టణ నాయకులు జగదీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

బిసి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బిసి రుణాలు పొందుటకు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులకు రాయితీతో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని బిసిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖాజీపేట : ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకొనుటకు శనివారం చివరిరోజని ఎంపిడిఒ కార్యాలయ ఎఒ వెంకటరమణ తెలిపారు. బిసి, బలిజ, కాపు తెలగ నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎంవిఐ వెంకట ప్రసాద్ సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో ఎంవిఐ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు. వాహనం నడిపే వారు లైసెన్స్ వాహన పత్రా లను కలిగి ఉండాలన్నారు. అతివేగం పనికిరాదని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ బస్, లారీ, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు ఉన్నత పాఠశాల 1983-84 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ దాతృత్వాన్ని ఘనంగా చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైన 36 డెస్కులను సమకూర్చారు. గత నెలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను సంబరంగా జరుపుకున్న వీరు.. నాడు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ రూ.లక్ష విలువైన డెస్కులు అందజేశారు. ఆ మేరకు శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయులు కె.వి.సుబ్బారెడ్డి, సిబ్బందికి డెస్కులను అప్పగించారు. తమ పాఠశాల చిన్నారులకు చక్కటి సౌకర్యం కల్పించిన పూర్వ విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించి, ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల పరిధిలోని గండిక్షేత్రంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో జాతీయ అంధత్వ నివారణ పథకం కింద విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ సురేంద్ర బాబు తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో దృష్టిలోపం ఉండి గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న 60మంది విద్యార్థులకు అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.వాణి, డాక్టర్ పి.రెడ్డన్న, సిహెచ్ఒ కె.వెంకటరామిరెడ్డి, ఎఎన్ఎం నవనీత, ఎంఎల్‌హెచ్‌పి మున్నేర, ఆశా కార్యకర్తలు ఎం.ప్రమీలమ్మ, అంజనమ్మ, బి.గౌరీదేవి, ఎఎంఒ మల్లేశ్వరరావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్యాధికారి సుధాకర్ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. వీరికి గతంలో కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ శాంతకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి, నేత్ర వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం మేరీ మంజుల, ఆశా కార్యకర్త మేరీ పద్మజ, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ శివప్రసాద్‌రెడ్డి, వైఎంఆర్ కాలనీ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు సూచించారు. స్థానిక వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంఘం ద్వారా శుక్రవారం ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో 138 మంది బాలికలకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆరోగ్య బోధకుడు వెంకటేశ్వర్లు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయుడు, సిఒ సుబ్బారెడ్డి, ఎఎన్ఎం, ఆశాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సొంత భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ శివమోహన్ రెడ్డి సూచించారు. మండలంలోని పైడిపాలెం, సింహాద్రిపురం రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆధునీకరణ(డిజిటిలైజేషన్) నిమిత్తం 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డును అందించనుందన్నారు. భవిష్యత్తులో పీఎం కిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వం నుంచి అందించే అన్ని రకాల ప్రయోజనాలు ఇందులో జమ చేస్తారన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతూ నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డు ప్రతి రైతుకూ తప్పనిసరి అని ఎఒ వి.చెన్నారెడ్డి తెలిపారు. మీదిపెంట్ల రైతుసేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్‌ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 1,491 మంది రైతులు మాత్రమే రైతు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ నమోదుకు ఈనెల 27 వరకు అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ అనుమతి హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

మార్చి 2 నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట ముందుగానే వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతివ్వడం హర్షణీయమని టిడిపి మైనార్టీ నేత యాసిన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసం ఉంటారని, వారికి ఇబ్బందులు లేకుండా చేసేందుకు గంట ముందస్తు అనుమతినివ్వడం సంతోషకరమన్నారు.

ప్రయివేట్ టీచర్లకు ఏడాది జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలోని ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల జీతాలు ఇవ్వాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో దాదాపు 2వేల మంది ప్రయివేట్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి అన్ని రకాల విద్యార్హతలు ఉన్నప్పటికీ హక్కులకు దూరంగా ఉంటున్నారన్నారు. ఉద్యోగ భద్రత లేదు, పిఎఫ్, ఇఎస్ఐ అసలే ఉండదన్నారు. కళాశాలల యాజమాన్యాలు వీరికి సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్‌లో ప్రభావం చూపేలా చేస్తామని గడ్డం రాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సూచించారు. పులివెందుల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను భోజన నాణ్యత, సదుపాయాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. భోజనం, పప్పు బాగున్నాయని తెలిపారు. కోడిగుడ్డు నాణ్యత, పరిమాణంపై విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తేగా.. కోడిగుడ్డు బరువును వెయింగ్ మిషన్ ద్వారా పరిశీలించి, 50 గ్రాములకు తక్కువగా ఉండడంతో ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే అధికారులతో మాట్లాడి దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కోడిగుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసం వద్ద శుక్రవారం ఉదయం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ఎమ్మెల్సీకి వినతి పత్రాలు సమర్పించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పిఆర్‌టియు స్టేట్ కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లాలోని పిఆర్‌టియు సమస్యలపై ఆయనతో చర్చించారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిఆర్‌టియు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశు, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గుర్నాథ్ రెడ్డి, రామ గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, మోపూరి భైరవేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రమణారెడ్డి, వేంపల్లి నాయకులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి ఉక్కు పరిశ్రమతోనే సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లా సమగ్రాభివృద్ధికి ఉక్కు పరిశ్రమ నెలకొల్పడంతోనే సాధ్యమని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ తిరుపతిలో మాట్లాడుతూ తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధు లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, మోహన్, ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుర్రం డేవిడ్‌రాజ్

చవ్వా సుదర్శన్‌రెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉంటున్న చవ్వా సుదర్శన్ రెడ్డి (67) మృతి చెందడంతో.. ఆయన భార్య సుభద్ర, కుమారులు వెంకట సాయినాథ్ రెడ్డి, సుమంత్ రెడ్డి, కోడళ్లు అనురాధ, సాయిపుష్ప చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డిష్ వెంకట రెడ్డి సమక్షంలో నేత్ర దానానికి అంగీకరించారు. ఆ మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ సుదర్శన్‌రెడ్డి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరా బాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

అనాలోచిత జిఒలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వైద్య ఆరోగ్య ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరంకుశ జిఒలను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముడియాల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ముడియాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. గత ప్రభుత్వం నిరంకుశ పరిపాలనలో వైద్య ఉద్యోగులకు 143/32 జిఒను ప్రవేశపెట్టి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రీడిప్లాయ్‌మెంట్ ద్వారా ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ముఖ ఆధారిత హాజరును పెట్టి వైద్య ఉద్యోగులను మానసిక వేదనకు గురి చేసిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు వర్కిం గ్ ప్రెసిడెంట్ భానుమూర్తి, రాష్ట్ర మహిళా ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి పిలుపు మేరకు పోస్ట్ కార్డు ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ రమాదేవి, ఫార్మసిస్ట్ జగదీశ్, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్ట్‌కార్డు ఉద్యమం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బిజివేముల ఉమామహేశ్వరి, నాగేశ్వర్‌రెడ్డి కూతురు తేజసాయి, నాగచరిత పుట్టినరోజు సందర్భంగా పదో తరగతి, ఇంటర్ చదివే 89 మంది బాలి కలకు పబ్లిక్ పరీక్షలు రాయడానికి అవసరమైన అట్ట, పౌచ్, పెన్నులు వంటి స్టేషనరీ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. దాతల సాయాన్ని సద్విని యోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు, తల్లి దండ్రులకు పేరు తేవాలనానరు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, పెద్దిరెడ్డి, టి.వెంకట సురేష్, భరత్ పాల్గొన్నారు.